వనమహోత్సవానికి సిద్ధం

- ఉమ్మడి నందిపేట్ మండలంలో 1.35 లక్షల మొక్కలు నాటడమే లక్ష్యం
- ప్రణాళిక రూపొందించిన అధికారులు
- ముమ్మరంగా సాగుతున్న పనులు

నందిపేట్: పచ్చదనం పెంచడమే లక్ష్యంగా వనమహోత్సవ నిర్వహణకు అధికారులు సిద్ధమయ్యారు. మండలంలో ఈ ఏడాది భారీ లక్ష్యాన్ని నిర్దేశించకుండా నాటిన మొక్కలను సంరక్షించడంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వనమహోత్సవ నిర్వహణకు ఏర్పాట్లు చేపడుతున్నారు. హరితహారంలో నాటిన మొక్కలు కొన్ని చోట్ల ఏపుగా పెరిగాయి. మరికొన్ని గ్రామాల్లో నాటిన వాటి ఆనవాళ్లు లేకుండా పోయాయి. ప్రత్యేక శ్రద్ధ తీసుకున్న చోట మొక్కలు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో మొక్కల సంరక్షణకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులు నిర్ణయించారు. గతంలో ఆదేశించినట్లుగా భారీగా మొక్కలు నాటాలని నిర్దేశించిన లక్షాన్ని సగానికి తగ్గించారు. నాటిన


బజార్‌కొత్తూర్ నర్సరీలో పెరుగుతున్న మొక్కలు

మొక్కలను బతికించాలన్న సంకల్పంతో ముందుకు సాగుతున్నారు.

గుంతలు సిద్ధం..

వనమహోత్సవ నిర్వహణకు ఉపాధి హామీ సిబ్బంది రోడ్ల వెంబడి, చెరువు గట్లపై, కాలి ప్రదేశాలలో కూలీలతో గుంతలు తవ్వించి ఫిట్టింగు చేయిస్తున్నారు. గ్రామాల వారిగా టార్గెట్ పెట్టుకుని గుంతలు తీసి సిద్ధంగా ఉంచుతున్నారు. గతంలో ఎక్కువ మొక్కలు నాటలనే లక్ష్యం ఉండగా ఈ సారి ఉమ్మడి నందిపేట మండలానికి 1,35,960 టార్గెట్ విధించారు. 33 జీపీల్లో గ్రామానికి ఒక నర్సరీని ఏర్పాటు చేశారు. నర్సరీల బాధ్యతలను గ్రామ పంచాయతీలకు అప్పగించారు. ఎప్పటికప్పుడు కార్యదర్శులు నర్సరీలను పర్యవేక్షిస్తూ మొక్కలను సంరక్షిస్తున్నారు. నర్సరీలో సుమారుగా 30 రకాల పండ్ల, పూల మొక్కలతో పాటు ఇతర మొక్కలను పెంచుతున్నారు. ఈ సారి మొక్కలకు జియో ట్యాగింగ్ చేయిస్తున్నారు.


అయిలాపూర్ నర్సరీలో మొక్కలకు నీరు పడుతున్న సిబ్బంది


కుద్వాన్‌పూర్ చెరువు కట్టపై మొక్కలు నాటేందుకు గుంతలు తీస్తున్న కూలీలు

అందరి భాగస్వామ్యంతో..



వనమహోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అందరి భాగస్వామ్యంతో ప్రణాళిక బద్ధంగా ముందుకెళ్తున్నాం. అన్ని శాఖల పరిధిలో మొక్కలు నాటేందుకు సిద్ధం చేశాం. లక్ష్యాన్ని చేరేందుకు ప్రజలు సైతం భాగస్వాములు కావాలి. మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణకు ప్రాధాన్యత ఇస్తాం.

– శ్రీనివాస్‌రావు, ఎంపీడీవో, నందిపేట్

భవిష్యత్ తరాల కోసం మొక్కలు నాటుదాం

పెర్కిట్: భవిష్యత్ తరాల కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి అన్నారు. మండలంలోని పిప్రి గ్రామంలో గురువారం నిర్వహించిన వన మహోత్సవం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని మొక్కలు నాటారు. అధికారులు, ప్రజా ప్రతినిధులకు లక్ష్యాలను నిర్దేశించి మొక్కలను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. కబ్జాకు గురవుతున్న చెరువులను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో సాయిరాం, ఎంపీవో శ్రీనివాస్, ఏపీవో సురేశ్, బీజేపీ మండల అధ్యక్షుడు రోహిత్ రెడ్డి, నాయకులు కేసీ ముత్తెన్న తదితరులు పాల్గొన్నారు.


పిప్రిలో మొక్క నాటుతున్న ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి

గుంతలతో తిప్పలు

- ఇబ్బందుల్లో కెనాల్‌కట్ట వాసులు
- పట్టించుకోని అధికారులు

ఆర్మూర్‌టౌన్: పట్టణ కేంద్రంలోని సిద్ధులుగుట్ట వెనుకాల ఉండే కెనాల్ కట్ట ప్రాంతంలో గుంతల రోడ్లతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాకాలం వచ్చిందంటే చాలు ఈ ప్రాంత ప్రజలు రోడ్డుపై ప్రయాణించాలంటేనే జంకుతున్నారు. గుంతల్లో నీరు చేరడంతో రాత్రి సమయంలో ద్విచక్రవాహనదారులు అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ విషయమైన సంబంధింత అధికారులు విన్నవించినా పట్టించుకోవడం లేదని స్థానికులు పేర్కొంటున్నారు. అంతేకాకుండా స్థానికంగా నివసిస్తున్న ప్రాంతాల్లో పిచ్చిమొక్కలు అధికంగా ఉండడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాత్రి సమయంలో ఇళ్లల్లో పాములు, తేళ్లు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్యను అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి గుంతలను పూడ్చి, పిచ్చిమొక్కలను తొలగించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.


నిజాంసాగర్ కెనాల్‌కట్ట రోడ్డుపై ఏర్పడిన గుంతలు

ఇళ్లలోకి పాములు వస్తున్నాయి

నిజాంసాగర్ కెనాల్ కట్టపై ఉన్న రోడ్డు గుంతలమయంగా మారింది. వర్షాకాలంలో ఈ ప్రాంతంలో రాకపోకలు సాగించడానికి ఇబ్బందిగా మారుతోంది. గుంతల్లో నీరు అధికంగా ఉండడంతో వాహనదారులు ప్రయాణం కష్టంగా ఉంది. రాత్రి సమయంలో ఇళ్లలోకి పాములు వస్తున్నాయి. అధికారులు స్పందించాలి.

– రాజు, కాలనీవాసి

నడవలేకపోతున్నాం

వర్షం పడితే చాలు నిజాంసాగర్ కెనాల్‌కట్ట రోడ్డంతా గుంతలమయంగా మారుతోంది. దీంతో రాత్రి సమయాల్లో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. గుంతల్లో నీరు చేరుతుండడంతో నడవలేక పోతున్నాం. అధికారులు స్పందించి కెనాల్‌కట్ట రోడ్డు వెంట మొర్రం వేసి గుంతలను పూడ్చాలి.

– రమేశ్, స్థానికుడు

కిసాన్‌నగర్‌లో వన మహోత్సవం

బాల్కొండ: మండలంలోని కిసాన్‌నగర్‌లో వన మహోత్సం సందర్భంగా గురువారం వరద కాలువ కట్టపై ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో 500 ఈత మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ సీఐ స్టీవెన్ మాట్లాడుతూ.. నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీధర్, ఎంపీడీవో విజయ్‌భాస్కర్‌రెడ్డి, ఎక్సైజ్ ఎస్సై గంగాధర్, ఏపీవో ఇందిరా, కార్యదర్శి శ్రీధర్, గీతా కార్మిక సంఘం అధ్యక్షుడు అమర్నాథ్ గౌడ్, మాజీ ఉప సర్పంచ్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


మొక్కలు నాటుతున్న అధికారులు

అక్రమ నిర్మాణాలను నిలిపివేయాలి

భీమ్‌గల్: అక్రమ నిర్మాణాలను నిలిపివేయాలని కోరుతూ కాంగ్రెస్ నాయకుడు మల్లెల లక్ష్మణ్ తహసీల్దార్‌కు గురువారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భీమ్‌గల్ మున్సిపాలిటీ పరిధిలోని 882 సర్వే నంబర్‌లో ఉన్న అసైన్డ్ భూమిలో అక్రమంగా మడిగెలు, రేకుల షెడ్డుల నిర్మాణాలు చేపడుతున్నారని అన్నారు. వీటిని నిలిపివేయాలని కోరారు.

ప్రభుత్వ పాఠశాలకు అండగా..



పెర్కిట్: ఆర్మూర్ మండలం చేపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గణితం బోధించడానికి విద్యా వలంటీర్ వేతనాన్ని చెల్లించేందుకు గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త గడ్డమీది లింగం గౌడ్ ముందుకు వచ్చారు. ఇటీవల జరిగిన ఉపాధ్యాయ బదిలీల్లో పాఠశాలలో గణిత బోధకుని స్థానం ఖాళీ ఏర్పడింది. దీంతో హెచ్‌ఎం చేతన కుమారి ఈ విషయాన్ని లింగం గౌడ్ దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఆయన విద్యా వలంటీర్‌ను ఏర్పాటు చేసుకోవాలని ప్రతి నెలా రూ. 6 వేల వేతనాన్ని తాను భరిస్తానని చెప్పారు. కష్టాల్లో ఉన్న పేదలను ఆదుకుంటూనే సామాజిక కార్యక్రమాలు చేపడుతున్న లింగం గౌడ్ పాఠశాలలో విద్యా వలంటీర్ ఏర్పాటుకు ముందుకు రావడంపై హెచ్‌ఎం చేతన కుమారి, ఉపాధ్యాయులు, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

మానాల మోహన్‌రెడ్డికి సన్మానం

బోధన్/ నందిపేట్/ బాల్కొండ/ వేల్పూర్/ మోర్తాడ్: రాష్ట్ర సహకార కార్పొరేషన్ యూనియన్ చైర్మన్‌గా మానాల మోహన్‌రెడ్డి హైదరాబాద్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సాలూర, బోధన్ మండలాల కాంగ్రెస్ పార్టీ నాయకులు మోహన్‌రెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. పార్టీ సాలూర మండల అధ్యక్షుడు మందర్న రవి, అల్లె రమేశ్, ఖాజాపూర్ అశోక్, ఎంఎన్‌గౌడ్, సాక్కం రవి, కొట్టల్ గంగయ్య తదితరులు ఉన్నారు. నందిపేట్ కాంగ్రెస్ నాయకులు మానాల మోహన్‌రెడ్డిని సన్మానించారు. పార్టీ మండల అధ్యక్షుడు మంద మహిపాల్, వైఎస్ గంగాధర్, బైండ్ల ప్రశాంత్, దేవిదాస్‌గౌడ్, ఎడ్డిగారి నిఖిల్, పీరాజి నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు. బాల్కొండ, ముప్కాల్, మెండోరా మండలాల కాంగ్రెస్ నాయకులు మానాల మోహన్‌రెడ్డి చేపట్టే పదవీ కార్యక్రమానికి హైదరాబాద్‌కు తరలివెళ్లారు. పార్టీ మండలాల అధ్యక్షులు వెంకటేశ్, ముత్యంరెడ్డి, కొత్తింటి ముత్యం రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. వేల్పూర్ నాయకులు మానాల మోహన్‌రెడ్డిని, రాష్ట్ర ఖనిజ అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా నియమితులైన ఈరవత్రి అనిల్‌ను సన్మానించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు గడ్డం నర్సారెడ్డి, నరేందర్, ఇంద్రా గౌడ్, బుట్టిమధు, రాజేందర్, రాము తదితరులు పాల్గొన్నారు. కమ్మర్‌పల్లి నుంచి కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.


మోహన్‌రెడ్డిని సన్మానిస్తున్న సాలూర నాయకులు


నందిపేట నాయకులు


మోహన్‌రెడ్డిని సన్మానిస్తున్న వేల్పూర్ నాయకులు


కమ్మర్‌పల్లి నాయకులు


హైదరాబాద్‌కు వెళ్తున్న బాల్కొండ నాయకులు

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవీపేట: మండలంలోని జన్నేపల్లిలో ఉన్న 33/11 కేవీ సబ్ స్టేషన్‌లో శుక్రవారం మరమ్మతులు చేపడుతున్నట్లు ట్రాన్స్‌కో ఏడీఏ సుహాసిని గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. సబ్ స్టేషన్ పరిధిలోని జన్నేపల్లి, సిరన్‌పల్లి, గాంధీనగర్, నారాయణ్‌పూర్ గ్రామాల్లో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. విషయాన్ని వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని జర్నలిస్టు కాలనీలో 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసినట్లు లైన్ మన్ సీతారాం గురువారం తెలిపారు. కాలనీలో లో వోల్టేజ్ సమస్యతో ఇబ్బందులు పడుతుండడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. లైన్ మన్ సంతోష్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన



ఎడపల్లి: ప్రపంచ జనాభా దినోత్సవం, సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న సందర్భంగా జడ్పీ ఉన్నత పాఠశాల తెలుగు మీడియం పాఠశాలలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఎడపల్లి సిబ్బంది గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వ్యాధులు రాకుండా ఉండాలంటే వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సాయిలు, ఏఎన్‌ఎం మాధవి, రాజమణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 -	డెస్పికబుల్ మీ-4 (తెలుగు) - 11.40, 2.00, 4.20, 6.40, 9.00
స్క్రీన్-2 -	కల్కి -2898ఏడీ (3డీ తెలుగు) - 10.45, 2.30, 6.15, 10.00
స్క్రీన్-3 -	కల్కి -2898ఏడీ (తెలుగు) - 10.00, 1.45, 5.30, 9.15
స్క్రీన్-4 -	కల్కి-2898ఏడీ (తెలుగు) - 11.30, 3.15, 7.00, 10.45

ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత నోట్‌బుక్స్ పంపిణీ




బోధన్: బోధన్‌కు చెందిన సొసైటీ ఫర్ ఆల్ ఇన్ నీడ్స్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు మత్తేశ్‌రెడ్డి సాలూర మండలంలోని తగ్గెల్లి ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు ఉచితంగా నోట్‌బుక్స్ వితరణ చేశారు. పాఠశాలలో దాత సోదరుడు శౌరిరెడ్డి విద్యార్థులకు నోట్‌బుక్స్‌ను గురువారం పంపిణీ చేశారు. హెచ్‌ఎం దాసరి ధన్‌రాజ్, లక్ష్మి, హన్మాండ్లు, కస్తూరి, విజయలక్ష్మి పాల్గొన్నారు. పట్టణంలోని తట్టికోట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు స్థానిక ప్రైవేట్ వైద్యుడు శైలేందర్ నోట్‌బుక్స్‌ను వితరణ చేశారు. హెచ్‌ఎం లలిత, సనా పటేల్, గోదావరి, నవిత, రాధిక పాల్గొన్నారు. సాలూర మండల కేంద్రంలోని దళితవాడలో ఉన్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గ్రామానికి చెందిన ప్రముఖ ఆర్టిస్ట్ లింబూరి లక్ష్మణ్ తన కుమార్తె తేజస్విని జన్మదినాన్ని పురస్కరించుకుని నోట్‌బుక్స్, పెన్నులు పంపిణీ చేశారు. హెచ్‌ఎం బీనాకుమారి, రాజమణి, రాజాగౌడ్, స్వామి గౌడ్, సింగాడి పాండు, డిస్కో సాయిలు, రాహుల్ లక్ష్మణ్, యాదు, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బీడీ కార్మికులకు జీవనభృతి ఇవ్వాలి

ఆర్మూర్‌టౌన్: బీడీ పరిశ్రమలో పనిచేస్తున్న అన్ని విభాగాల కార్మికులకు రూ. 4116 జీవన భృతి ఇవ్వాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి ఎం ముత్తన్న అన్నారు. పట్టణంలోని కుమార్ నారాయణభవన్‌లో ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీడీ కార్మికులకు జీవనభృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. నాయకులు రాజేశ్వర్, అరవింద్ పాల్గొన్నారు.

ఎమ్మార్సీలో పాఠశాలల ఆడిట్



రుద్రూర్: మండల కేంద్రంలోని విద్యా వనరుల కేంద్రంలో సమగ్ర శిక్షా అభియాన్ బృందం సభ్యులు గురువారం ఆడిట్ నిర్వహించారు. కోటగిరి, పాతంగల్, రుద్రూర్ మండలాలకు చెందిన ఉపాధ్యాయులు వారి పాఠశాలల వివరాలను ఆడిట్ బృందానికి అందజేశారు. పాఠశాలలకు మంజూరైన నిధులు, చేపట్టిన పనులు, చెల్లించిన డబ్బుల రసీదులు, క్యాష్ బుక్, తీర్మాన ప్రతులను బృందం సభ్యులు పరిశీలించారు. శుక్రవారం వర్ని, మోస్రా, చందూర్‌లో ఆడిట్ ఉంటుందని పేర్కొన్నారు.

పాఠశాల పనులను పూర్తి చేయించాలి

మాక్లూర్: నిర్మాణంలో ఉన్న మాక్లూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల భవన పనులను త్వరగా పూర్తి చేయాలని పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో విద్యార్థులు తహసీల్దార్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్, దేశెట్టి స్నేహిత్, వంశీ, రాజు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డిని ప్రిన్సిపాల్ దుర్గారెడ్డి గురువారం కలిసి విన్నవించారు. మండలంలోని పిప్రి శివారులో వనమహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యేకు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. స్పందించిన ఎమ్మెల్యే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలపై పోరాటం

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ డివిజన్‌లోని ప్రభుత్వ విద్యారంగంపై నెలకొన్న సమస్యలపై యూఎస్‌ఎఫ్ఐ ఎల్లప్పుడు పోరాటం చేస్తుందని జిల్లా కార్యదర్శి పెద్దిసూరి అన్నారు. పట్టణంలోని సీవీఆర్ జూనియర్ కళాశాలలో ఆర్మూర్ డివిజన్ యూఎస్‌ఎఫ్ఐ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా జవహార్‌సింగ్, సిద్ధాల నాగరాజుతో పాటు 13మంది సభ్యులను ఎన్నుకున్నారు. నాయకులు విఘ్నేశ్‌నాయక్, సుశీల్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణం పరిశీలన

నవీపేట: మండల కేంద్రంలోని ఇరిగేషన్ స్థలంలో అక్రమ నిర్మాణం చేపడుతున్నారనే ఫిర్యాదుతో ఎంపీవో రామకృష్ణ గురువారం ఆ స్థలాన్ని పరిశీలించారు. హోటల్ మజమాని అప్రోజ్‌ఖాన్ పరదాలు ఏర్పాటు చేసుకుని ఇంటికి ఆనుకుని ఉన్న ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసేందుకు యత్నిస్తున్నాడని ఇరిగేషన్ ఏఈ శ్రీధర్, జీపీ కార్యదర్శి నవ్యశ్రీలు నోటీసులు పంపించారు. కబ్జా విషయంపై సీరియస్‌గా ఉన్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి తగు చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులు స్థానిక అధికారులను ఆదేశించారు. అక్రమ నిర్మాణం ఆపాలని, ఇది వరకు నిర్మించిన కట్టడాన్ని కూల్చాలని ఆదేశించారు.

ఎన్నికపత్రం అందజేత

బోధన్: పట్టణంలోని మారుతి మందిరం ప్రధాన అర్చకుడు ప్రవీణ్ మహరాజ్ తెలంగాణ బ్రాహ్మణ సేవా సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా కేంద్రంలో గురువారం సంఘం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా ఉపాధ్యక్షుడిగా ప్రవీణ్ మహారాజ్ ఎన్నిక కాగా ఎన్నికల నిర్వహణ అధికారి నుంచి ఎన్నికపత్రాన్ని అందుకున్నారు. ప్రవీణ్ మహరాజ్ ఎన్నికపై బ్రాహ్మణ సేవా సంఘం బోధన్ శాఖ ప్రతినిధులు వినోద్ పట్వారీ, ఉమానంద్ వైద్య, రాజు కులకర్ణి, విజయ్‌కుమార్ కులకర్ణి, సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

వసతులు కల్పించాలి

బోధన్‌రూరల్: సంక్షేమ వసతి గృహాల్లోని విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలని టీజీవీపీ జిల్లా అధ్యక్షుడు బొబ్బిలి కళ్యాణ్ డిమాండ్ చేశారు. తెలంగాణ విద్యార్థి పరిషత్ బోధన్ డివిజన్ ఆధ్వర్యంలో బోధన్ ఎమ్మార్వో కార్యాలయం ఎదుట గురువారం ధర్నా నిర్వహించి ఎమ్మార్వోకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాగేశ్, శివ, లోకేశ్, మన్మథ, ప్రసాద్, రామ్, ప్రసాద్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

న్యాయవాదుల నిరసన

ఆర్మూర్‌టౌన్/ బోధన్‌టౌన్: సిద్దిపేట జిల్లా కోర్టు న్యాయవాది రవికుమార్‌పై జరిగిన దాడిపై ఆర్మూర్, బోధన్ కోర్టుల బార్ అసోసియేషన్‌ల ఆధ్వర్యంలో గురువారం నిరసన తెలిపారు. ఆర్మూర్‌లో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తెడ్డు నర్సయ్య, దేవరశెట్టి అరుణ్, తుమ్మ సుకేశ్, తాజుద్దీన్, కృష్ణంరాజు, జగదీశ్, శ్రీధర్, అశోక్, రమేశ్ పాల్గొన్నారు. బోధన్‌లో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రెడ్డి, ప్రధాన కార్యదర్శి కోటేశ్వరరావు, న్యాయవాదులు పాల్గొన్నారు.

వేల్పూర్‌లో మొక్కల పంపిణీ

వేల్పూర్: మండల కేంద్రంలో మండల స్పెషల్ ఆఫీసర్ కృష్ణవేణి గురువారం ప్రతి ఇంటికి మూడు మొక్కలు చొప్పున పంపిణీ చేశారు. పల్లె ప్రకృతి వనాన్ని విజిట్ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. వేల్పూర్, అక్లూర్‌లో అమ్మ ఆదర్శ పాఠశాల పనులను తనిఖీ చేశారు. అమీనాపూర్ పల్లె ప్రకృతి వనాన్ని తనిఖీ చేసి గ్రామంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీడీవో బాలకిషన్, ఏపీవో అశోక్, టెక్నికల్ అసిస్టెంట్లు స్వరూప, శ్రీను, సుఖేశ్, పంచాయతీ కార్యదర్శులు వినోద్, అరుణ్, విపుల్, ఫీల్డ్ అసిస్టెంట్లు శ్రీకాంత్, రాజేశ్వర్, గంగాధర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాల్లో రిజర్వేషన్లు కల్పించాలి

పెర్కిట్/ నందిపేట్: ప్రభుత్వ పథకాల్లో రిజర్వేషన్లు కల్పించాలని నందిపేట మండల వికలాంగుల అసోసియేషన్ నాయకులు గురువారం ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డిని కలిసి కోరారు. ఆర్మూర్ మండలం అంకాపూర్‌లో ఎమ్మెల్యేను తన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. వికలాంగులకు పింఛన్ పెంపుదలతో పాటు మిగతా పథకాల్లో రిజర్వేషన్లు వెంటనే అమలయ్యేలా చూడాలని కోరారు. నందిపేట మండలంలో వికలాంగుల కోసం భవనాన్ని ఏర్పాటు చేయాలన్నారు. నియోజకవర్గ వికలాంగులకు మూడు చక్రాల మోటార్ వాహనాలను ఇప్పించాలని కోరారు. ఎమ్మెల్యే స్పందిస్తూ స్థానిక అధికారులతో చర్చించి వారం రోజుల్లో అనువైన స్థలం ఇప్పిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వికలాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు సంగొల్ల లక్ష్మి, భూమేశ్, ముత్తన్న, సుదర్శన్, సాగర్, ముత్యం, చరణ్, స్వప్న, లక్ష్మి, షేక్ కలీం, లింగం, మురళి, సుధాకర్, సాయన్న తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీని అమలు చేయాలి

రెంజల్: ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం వెంటనే రూ. 2 లక్షల రుణ మాఫీని అమలు చేయాలని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ మండల కమిటీ తీర్మాణించింది. మండలంలోని బోర్గాంలో గురువారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పలు తీర్మాణాలు చేశారు. సీఎం రేవంత్ ఆగస్టు 15 వరకు రుణ మాఫీ చేస్తానని వాగ్దానం చేశారని, బ్యాంకర్లు మాత్రం రైతుల రుణాలను రెన్యువల్ చేయించుకుంటున్నారని పేర్కొన్నారు. అధికారులు ఆ దిశగా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ప్రతినిధులు పుట్టి నాగన్న, పార్వతి రాజేశ్వర్, సెద్దులు, గోపాల్, నసీర్, పోశెట్టి, హైమద్, భీంసింగ్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు సన్మానం

బోధన్: నిజాం దక్కన్ షుగర్స్ లిమిటెడ్ కార్మికులు రఘునాథ్, భూమయ్య, సూరజ్ ప్రసాద్, మోహిన్ బేగ్ గురువారం ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా కార్మిక నాయకుడు నాగేశ్వర్‌రావు వారిని ఫ్యాక్టరీ ఎదుట సన్మానించారు. కార్మికులు గాలయ్య, నయీమొద్దీన్, లింగం గౌడ్, బషీర్, వికారుద్దీన్, మంగీయా తదితరులు పాల్గొన్నారు.

మాజీ జెడ్పీటీసీకి..

రుద్రూర్: జెడ్పీటీసీగా విధులు నిర్వర్తించి ఇటీవల పదవీ విరమణ చేసిన జెడ్పీటీసీ సరోజ గంగారాంను స్థానిక యువకులు దాత్రిశ్రీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. మండల అభివృద్ధికి జెడ్పీటీసీగా ఎంతో కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో అక్కపల్లి నాగేందర్, మోత్కురి నారాయణ, గాండ్ల మధు, ప్రశాంత్ గౌడ్, సాయి కిరణ్, సత్యానందం, భూపేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు..

మాక్లూర్: మండలంలోని వల్లభాపూర్ ప్రాథమిక పాఠశాలలో పదోన్నతిపై వెళ్తున్న ఉపాధ్యాయులు శ్రీనివాస్‌గౌడ్, దేవారెడ్డి, విజయరాజ్‌లను గ్రామస్తులు పాఠశాలలో గురువారం ఘనంగా సన్మానించారు. పాఠశాలకు అభివృద్ధికి ఎంతో కృషి చేశారని కొనియాడారు. ఉపాధ్యాయులు బదిలీపై వెళ్తుంటే విద్యార్థులు కంటతడి పెట్టారు. కార్యక్రమంలో బి దయాకర్‌రావు, మెట్టు లక్ష్మీనారాయణ, శ్రీనివాస్, ఎస్ రాజేశ్వర్‌రావు, సుంకరి కమలాకర్, రచ్చ మురళి, విద్యార్థులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు ఉద్యోగికి..

నందిపేట్: మండల విద్యావనరుల కేంద్రంలో కాంట్రాక్టు ఉగ్యోగిగా సేవలందించి విరమణ పొందిన మీరా మొయినొద్దీన్‌ను ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు సమగ్ర శిక్ష అభి యాన్ ఉద్యోగులు బాసటగా నిలిచి పోగుచేసి న రూ. 82 వేలను మొయినొద్దీన్‌కు అందజేశా రు. కార్యక్రమంలో కిషన్, ప్రసాద్, నరేశ్, రామ్‌రెడ్డి, సాయాగౌడ్, బోజారాం, రఘువీర్, భూషణ్, రమేశ్, రాజు, మల్కన్న, రాజు, సాగ ర్, పవిత్ర, నగేశ్‌గౌడ్, సురేశ్ పాల్గొన్నారు.

ఘనంగా ఇంజినీర్ల దినోత్సవం

బాల్కొంద: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ కార్యాలయం వద్ద గురువారం తెలంగాణ ఇంజినీర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నవాబ్ అలీజంగ్ బహదూర్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎస్ఈ లాల్‌సింగ్, ఈఈ చక్రపాణి, డిప్యూటీఈఈలు గంగాభూషణ్, గణేశ్, ఏఈఈలు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.